


**1**
భారత్ తరపున అత్యంత పిన్న వయస్సు(21ఏండ్లు) లో ఒలింపిక్ పతకం నెగ్గిన తొలి ప్లేయర్

**8**
ఓవరాల్‌గా ఒలింపిక్స్‌లో ఇప్పటి వరకు భారత్‌కు రెజ్లింగ్‌లో వచ్చిన పతకాలు. హాకీ (13) తర్వాత ఈ క్రీడలోనే అత్యధికం.

### కాంస్య పోరులో మెరిసిన సెహ్రావత్..

# అమన్ అద్భుత:

## రెజ్లింగ్‌లో భారత్‌కు తొలి మెడల్ • పారిస్‌లో 'ఆరు'కు చేరిన పతకాల సంఖ్య

**ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్‌లో భారత మల్లయోధుల పతక హవా దిగ్విజయంగా కొనసాగుతున్నది. 1952లో కేడీ జాదవ్ చారిత్రక కాంస్యంతో మొదలైన రెజ్లింగ్ పతక ప్రస్థానం కొత్త పుంతలు తొక్కుతున్నది. స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ పసిడి పతక ఆశలు ఆవిరైన వేళ తాను ఉన్నానంటూ యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్ చిరుతలా దూసుకొచ్చాడు. జపాన్ రెజ్లర్ చేతిలో సెమీస్‌లో ఓడిన అమన్..కాంస్య పతక పోరులో బెబ్బులిలా విరుచుకుపడ్డాడు. పూర్టోరికో రెజ్లర్ క్రజ్ డెరియన్‌కు చుక్కలు చూపిస్తూ వరుస రౌండ్లలో అద్భుత విజయాన్ని సొంతం చేసుకున్నాడు. ఆదిలో నెమ్మదించినా..పట్టు బిగించిన తర్వాత ప్రత్యర్థిని మెలికలు తిప్పుతూ వరుస పాయింట్లు కొల్లగొట్టాడు. డెరియన్ పుంజుకునేందుకు ఏ మాత్రం అవకాశమివ్వని అమన్..అతి పిన్న వయసులో ఒలింపిక్స్‌లో పతకం గెలిచిన తొలి భారత ప్లేయర్‌గా అరుదైన రికార్డు సొంతం చేసుకున్నాడు. తద్వారా పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు ఆరో పతకాన్ని అందించి ఔరా అనిపించాడు. అమన్ కాంస్య పతకంతో వరుసగా ఐదు ఒలింపిక్స్‌లో రెజ్లింగ్‌లో పతకాలు మనకు దాసోహమయ్యాయి.**

పారిస్: భారత యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్ దేశానికి ఆరో పతకాన్ని అందించాడు. మహిళల విభాగంలో స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ అసమాన పోరాటంతో స్వర్ణం లేదా రజతం ఖాయం చేసినా ఫైనల్ పోరుకు కొన్నిగంటల ముందు ఆమె నిర్దేశిత బరువు కంటే వంద గ్రాములు అధికంగా ఉందని 'అనర్హత వేటు' ఎదుర్కోవడంతో ఈ క్రీడలో పతకంపై ఆశలు అడుగంటిన వేళ అమన్ మాత్రం ఆ లోటును తన పతకంతో పూరించాడు. పురుషుల 57 కిలోల ఫ్రీ స్టయిల్ విభాగంలో బరిలోకి దిగిన అమన్ సెమీస్‌లో ఓడినా కాంస్య పోరులో మాత్రం అదరహో అనిపించాడు. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో అమన్ 13-5తో క్రజ్ డెరియన్ (పూర్టోరికో)ను ఓడించి కంచు మోత మోగించాడు. రెజ్లింగ్‌లో భారత్‌కు పారిస్‌లో ఇదే తొలి పతకం కాగా మొత్తంగా ఆరోవది. వినేశ్ పతకం విషయంలో నిరాశగా ఉన్న భారత క్రీడాభిమానులకు అమన్ కాంస్యం కాస్త స్వాంతన కలిగించేదే. అతడు తెచ్చింది కాంస్యమే అయినా ప్రస్తుత పరిస్థితులలో అది పసిడి కంటే ఎన్నో రెట్లు విలువైనది.

**ప్రణాళికతో 'పట్టు'బట్టి..**

సెమీస్‌లో జపాన్ రెజ్లర్ హిగూచి చేతిలో ఓడిన అమన్ కాంస్య పోరుకు మాత్రం పక్కా ప్రణాళికతో వచ్చాడు. ప్రత్యర్థిపై ఆది నుంచే ఎదురుదాడికి దిగాడు. అవతలి వైపు క్రజ్ కూడా దూకుడు చూపించడంతో పోరు కాస్తా హోరాహోరీ అయింది. తొలి బౌట్ ఆరంభమైన కొద్దిసేపటికే అమన్‌ను కిందకు పడగొట్టి తొలి పాయింట్ దక్కించుకున్న క్రజ్‌కు ఆ తర్వాత భారత రెజ్లర్ చుక్కలు చూపించాడు. క్రూజ్ కాళ్లను మెలేసి పదే పదే కింద పడగొడుతూ పాయింట్లు రాబట్టాడు. మొదటి రౌండ్ ముగిసేసరికి 6-3 ఆధిక్యంలో ఉన్న అతడు.. రెండో రౌండ్‌లో దూకుడును మరింత తీవ్రతరం చేశాడు. ముక్కుపై గాయమై రక్తపు చుక్కలు కారుతున్నా వెరవకుండా ఆటను కొనసాగించాడు. అమన్ 'పట్టు'కు తొలి బౌట్‌లో కాస్త ప్రతిఘటించిన పూర్టోరికో రెజ్లర్ కీలకమైన రెండో రౌండ్‌లో మాత్రం చేతులెత్తేశాడు. వీలు చిక్కినప్పుడల్లా అతడిని కిందపడేస్తూ పాయింట్లు రాబట్టడమే గాక ప్రత్యర్థిని ఊపిరాడనీయకుండా చేయడంలో అమన్ సఫలీకృతుడయ్యాడు.



# ఇద్దరూ మా బిడ్డలే

### పతకాలు ఎవరికొచ్చినా సమానమే

**నీరజ్, నదీమ్ తల్లుల ఆత్మీయ స్పందన • సోషల్ మీడియా ఫిదా**



ఢిల్లీ: విశ్వక్రీడల్లో భాగంగా గురువారం అర్ధరాత్రి ముగిసిన జావెలిన్ త్రో ఫైనల్‌లో స్వర్ణం, రజతం సాధించిన అర్షద్ నదీమ్ (పాకిస్థాన్), నీరజ్ చోప్రా (భారత్) మాతృమూర్తులు తమ కొడుకుల ప్రదర్శనపై స్పందించిన తీరు మానవతావాదులను హత్తుకునేలా చేసింది. నీరజ్ తల్లి సరోజ్ దేవి మాట్లాడుతూ.. 'నీరజ్ రజతం సాధించినందుకు సంతోషంగా ఉంది. ఫైనల్‌లో స్వర్ణం గెలిచిన నదీమ్ సైతం మా కొడుకు వంటి వాడే. వాళ్లంతా క్రీడాకారులు. అందరూ కష్టపడతారు. నదీమ్ చాలా మంచి ప్రదర్శనతో స్వర్ణం సాధించాడు. నీరజ్, నదీమ్ మధ్య పెద్దగా తేడాల్లేవు. మా ఇంట్లోకి పసిడి, వెండి పతకాలు వచ్చాయి. వాటిలో మాకు వ్యత్యాసం ఏమీ లేదు' అని తెలిపింది. ఇక అర్షద్ తల్లి రజియా పర్విన్ మాట్లాడుతూ.. 'నీరజ్ కూడా నా కొడుకుతో సమానం. అతడు నదీమ్ స్నేహితుడే గాక సోదర సమానుడు. ఆటలో గెలుపోటములు సహజం. నీరజ్‌కూ దేవుడి ఆశీర్వాదం ఉండాలి. అతడు ఇంకా పతకాలు గెలవాలి. నేను నీరజ్‌కూ పతకం రావాలని దేవుడిని వేడుకున్నా' అని వ్యాఖ్యానించింది. ఇరు దేశాల మధ్య చాలా కాలంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నా ఈ ఇద్దరు అథ్లెట్ల తల్లుల వ్యాఖ్యలు మాత్రం ఎంతో పరిణితితో ఉండటమే గాక రెండు దేశాల ప్రజల మధ్య ఐక్యతను చాటాయని సోషల్ మీడియాలో నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. కాగా రజతం గెలిచిన తర్వాత నీరజ్‌తో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని మోదీ.. ''ఫైనల్ ముగిశాక మీ తల్లి ఇంటర్వ్యూ చూశాను. 'స్వర్ణం పతకం గెలిచిన వ్యక్తి కూడా నా కొడుకుతో సమానం' అని ఆమె చెప్పింది. ఆమె వ్యాఖ్యలు క్రీడా స్ఫూర్తికి నిదర్శనం'' అని కొనియాడారు.




### బరిలో నీరజ్.. బద్దలైన రికార్డులు

- **ఒలింపిక్స్ వెబ్‌సైట్, యాప్‌కు పోటెత్తిన నెటిజన్లు**

పారిస్: భారత యువ అథ్లెట్ నీరజ్ చోప్రా గురువారం అర్ధరాత్రి బరిలో నిలిచిన జావెలిన్ త్రో ఫైనల్ సందర్భంగా ఒలింపిక్స్ వెబ్‌సైట్, యాప్‌నకు నెటిజన్లు పోటెత్తారు. ఈ ఎడిషన్‌లో మొదటిసారిగా వెబ్, యాప్‌ను 273 మిలియన్ల (సుమారు 27.3 కోట్ల మంది) యూజర్లు వీక్షించారు. తాజా ఎడిషన్‌లో ఇదే అత్యధికం. భారత హాకీ జట్టు కాంస్య పతక మ్యాచ్‌తో పాటు రాత్రి 11.55 గంటలకు మొదలైన నీరజ్ చోప్రా ఫైనల్ పోరును ప్రత్యక్షంగా వీక్షించేందుకు భారత క్రీడాభిమానులు అమితాసక్తి చూపించారని ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీకి చెందిన కార్పొరేట్ కమ్యూనికేషన్స్, పబ్లిక్ అఫైర్స్ డైరెక్టర్ క్రిస్టియన్ క్లా 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

# 404 కిలోలు ఎత్తిపడేశాడు!

## బల్గేరియా వెయిట్‌లిఫ్టర్ కార్లొస్ ప్రపంచ రికార్డు

పారిస్: బల్గేరియా వెయిట్ లిఫ్టర్ కార్లొస్ నాసర్ రికార్డు బరువు ఎత్తి పారిస్‌లో కొత్త చరిత్ర లిఖించాడు. 21 ఏండ్ల ఈ కుర్రాడు పురుషుల 89 కిలోల విభాగంలో ఏకంగా 404 కిలోల బరువును ఎత్తి ఒలింపిక్ రికార్డులతో పాటు ప్రపంచ రికార్డుల దుమ్ము దులిపాడు. స్నాచ్‌లో 180 కిలోలు ఎత్తిన కార్లొస్.. క్లీన్ అండ్ జర్క్‌లో రికార్డు స్థాయిలో 224 కిలోల బరువును ఎత్తేశాడు. క్లీన్ అండ్ జర్క్‌లో ఇప్పటి వరకూ ఇదే అత్యుత్తమం. కాగా గతేడాది బాత్‌రూమ్‌లో గోడ కూలి తీవ్ర గాయాల పాలై సర్జరీ చేయించుకున్న కార్లొస్.. ఏడాది కాలంలో పూర్తిగా కోలుకోవడమే గాక రికార్డు స్థాయిలో బరువును ఎత్తి పసిడి గెలుచుకోవడం విశేషం. ఇదే పోటీలో రజతం సాధించిన కొలంబియా అథ్లెట్ యాసన్ లోపెజ్ (390 కిలోలు) స్నాచ్‌లో 182 కిలోలతో వరల్డ్ రికార్డు నమోదు చేసుకున్నాడు. ఇటలీ ప్లేయర్ అంటానియో 383 కిలోలు ఎత్తి కాంస్యం గెలుచుకున్నాడు.




### పతకాల పట్టిక

| | దే | స్వ | ర | కా | మొ |
|---|---|---|---|---|---|
| 1 | చైనా | 32 | 25 | 21 | 78 |
| 2 | యూఎస్ఏ | 31 | 39 | 38 | 108 |
| 3 | ఆస్ట్రేలియా | 18 | 16 | 14 | 48 |
| 4 | ఫ్రాన్స్ | 14 | 20 | 22 | 56 |
| 5 | బ్రిటన్ | 14 | 20 | 22 | 56 |
| 6 | జపాన్ | 14 | 8 | 13 | 35 |
| 66 | భారత్ | 0 | 1 | 5 | 6 |

దే : దేశం, స్వ: స్వర్ణం, ర: రజతం, కా: కాంస్యం మొ: మొత్తం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

# 13న మాదిగ అమరవీరులకు నివాళి

ముషీరాబాద్, ఆగస్టు 9: ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణాలర్పించిన మాదిగ అమరవీరులకు వర్గీకరణ విజయాన్ని అంకితం చేస్తూ ఈ 13న నివాళి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం విద్యానగర్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరుల త్యాగాలవల్లనే వర్గీకరణ ఉద్యమం పతాక స్థాయికి చేరుకుందని, రేపు వర్గీకరణ ఫలితాలు అనుభవించనున్న ప్రతి కుటుంబం రుణపడి ఉంటుందని తెలిపారు. అమరుల త్యాగాలను స్మరించుకుంటూ అంబేద్కర్, అమరవీరుల విగ్రహాలు, చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బండారు శ్రీనివాస్, చాప కృష్ణ, వేణు, యాకన్న, రాజేశ్, కొల్లూరి వెంకట్, రాజేందర్ పాల్గొన్నారు.

## నర్సాపూర్-బెంగళూరు మధ్య ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): నర్సాపూర్-బెంగళూరు , సికింద్రాబాద్-రామాంతపురం రైల్వే స్టేషన్ల మధ్య రెండేసి ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్టు శుక్రవారం రైల్వే అధికారులు తెలిపారు. ఈ నెల 16 నుంచి సెప్టెంబర్ 28 వరకు ఈ రైళ్లు రాకపోకలను సాగిస్తాయని పేర్కొన్నారు. బెంగళూరు-కలబుర్గి స్టేషన్ల మధ్య ఆరు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు.

## చిరుధాన్యాలతో జీవనసిరి


హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): ముచ్చింతల్‌లో 24, 25, 26 తేదీల్లో చిరుధాన్యాలతో జీవనసిరి అనే అంశంపై డాక్టర్ ఖాదర్‌వలీ, సరళాఖాదర్ అవగాహన కల్పిస్తున్నట్టు రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్, పద్మశ్రీ డాక్టర్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. ఇందులో పాల్గొనేవారు 9705383666, 7093973999 ఫోన్ నంబర్లలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

# కాంగ్రెస్‌ది ద్వంద్వ వైఖరి

- **అధికారంలోకి రాగానే కులగణన ఏమైంది?**
- **కాంగ్రెస్ నేతల భిన్నాభిప్రాయంపై బీసీ నేతల నిలదీత**



ఖైరతాబాద్, ఆగస్టు 9: కులగణనపై కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో ఓమాట, గల్లీలో ఓమాట మాట్లాడుతూ ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారని బీసీ నేతలు అభిప్రాయపడ్డారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల ముందు కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ నాయకులు.. తమ పార్టీ అధికారంలోకి రాగానే కులగణన చేపడుతామని, 42 శాతం రిజర్వేషన్లు అమలుచేసిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. అధికారంలోకి రాగానే కులగణన ఏమైందని నిలదీశారు. ఓ వైపు ఢిల్లీలో రాహుల్‌గాంధీ కులగణన చేయాలని, రిజర్వేషన్లు పెంచాలని నినదిస్తుంటే, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి భిన్నంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ మాటలకు తెలంగాణ ప్రభుత్వం విలువ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాంయాదవ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి బీసీలపై ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. బీసీలకు న్యాయం జరగాలంటే పోరాటమే ఏకైక మార్గమని స్పష్టంచేశారు. కులగణన, బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నేడు ఇందిపార్కు వద్ద బీసీల సత్యాగ్రహ దీక్ష చేపడుతున్నామని, బీసీలు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రొఫెసర్ తిరుమలి, బత్తుల సిద్దేశ్వర్లు, ప్రభంజన్‌యాదవ్, సాంబశివగౌడ్, కట్టెకోల శ్రీహరిముదిరాజ్, అశోక్, మాధవి, శ్రీహరి ముదిరాజ్, సురేశ్‌ముదిరాజ్, మహేశ్‌గౌడ్ పాల్గొన్నారు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.